కథ

# సోషలిజమ్

బాబ్జీ

"యనుములమ్మా... ఓ యనుములమ్మా..."

ఉలుకూ పలుకూ లేదు.

"ముసలమ్మ సచ్చిందేమో" అనుకున్నాడు అప్పారావు. అతని ఎడమ చేతిలో వోటర్ల జాబితా ఉంది. కుడి చేతిలో దర్జాగా వెలిగిపోతున్న ఖరీదైన సిగరెట్టుంది. అతని వంటిమీద నిగనిగ మెరిసిపోతున్న తెల్లటి బట్టలున్నాయి. జేబులు బరువుగా ఉన్నాయి. ఉబ్బెత్తుగా కొట్టొచ్చినట్టున్నాయి. అతని చుట్టూ ఐదుగురు చోటారాయుళ్ళున్నారు.

మరింత గట్టిగా మళ్లీ పిలిచాడు.

"ఎవరారు?" అంటూ గుడిసె బయటకు వచ్చింది యనుములమ్మ. మనుషుల్ని తేరిపార చూసింది. మసక మసగ్గా గోరీల్లోంచి లేచివచ్చిన దెయ్యాల్లా కనిపించారు. ఎవరో అంతుపట్టలేదు. ఇంత పొద్దున్నే ఎందుకొచ్చారో అర్థంకాలేదు.

"బాగున్నావా యనుములమ్మా?" తెల్లదుస్తుల శాల్తీ ఆత్మీయత కురిపిస్తూ అడిగింది.

"చూపానదు. ఎవరు నాయనా నువ్వు?" అంది ఎగాదిగా చూస్తూ.

"పోనీ ఇనపడుతుందా?" వెటకారంగా అడిగాడు అప్పారావు.

"ఆ"

అతగాడు ఆ ఊరి లీడరు సొంత బామ్మర్ది. బావగారికి వోటెయ్యమని అడగడానికి వచ్చాడు.


"మొన్న వచ్చాం కదా?" గుర్తుచేశాడు.

"అవును అవును" ముగ్గుబుట్ట తల ఆడించింది అవ్వ.

"నువ్వు తప్పకుండా రావాలి. మా పార్టీకి వోటెయ్యాలి మరి" అన్నాడు ఒకడు.

వాళ్ల పార్టీ పేరు, అభ్యర్థి పేరు చెప్పారు ఇద్దరు ముగ్గురు కలగాపులగంగా.

"మరిచిపోవద్దు అవ్వా" అన్నాడు ఇంకో పెద్దమనిషి.



ఇంకో వోటుకోసం మరో పెద్ద మనిషి ఆశగా ఆరా అడిగాడు... "మీ ముసిలోడు ఉన్నాడా?"

"చచ్చి పదేళ్లయిందిగందా?" అంది ముసలమ్మ. నిలబడలేక మట్టి అరుగుమీద కూలబడింది.

"పిల్లలు?"

"ఇంకెక్కడి పిల్లల్రా దేవుడో?" అవ్వ కళ్ల నీళ్లతో నిండాయి. తల్లి పేగు కదిలింది.

"పెద్ద కొడుకు మిల్ట్రీకి పోయాడు. సచ్చాడో ఉన్నాడో తెలీదు. రెండోవాడు ఇంటిపట్టునే ఉండేవోడు. రిచ్చా తొక్కేవోడు. దారిపోయేవాణ్ణి పొడిచి చంపారు కదా నాయనా" యనుములమ్మ ఏకరువు పెట్టింది.

"ఎవడాడు?"

"నాకేటి తెలుసు బాబూ. పోలీసోడికే తెలీదు, పొడిసి సంపీమంటారు. లూటీలు సేసుకొని బతకమంటారు. మీ లీడర్లే డబ్బులిత్తారుగందా?"

"అదేటవ్వా, అలాగంటావు?"

"అవున్నాయనా అలా అనరాదులే" దీర్ఘం తీసింది. ముడతలు తేలిన దేహం నిలువెల్లా వణికింది.

"ఇంకెవరూ లేరా?"

"ఉండేవాడు. చిన్నోడు, మీసమన్నా రాలేదు. ఓడరేవులో పనిచేసేవోడు. సంగంలో తిరిగేవాడు. ఉన్నట్టుండి మాయమైపోయాడు" ముసలమ్మ గొల్లుమంది.

"మరి లీడర్లకు సెప్పనేదేటి?"

"ఎంతమంది కాళ్లట్టుకున్నానో మీకేటి తెల్సు బాబూ. మీ పెద్ద బాబులంతా ఒకటి. మా కూలోల్లమే ఒకటి కాదు. అలగా జనం సంగతి ఎవరికంట?" కళ్లు వత్తుకుంటూ కాస్త తేరుకుంది.

"ఇప్పుడెవరూ లేరా?"

"ఎవరున్నారు నాయనా?"

ఆకాశంలోకి చూసింది.

"దిక్కులోనోల్లకు దేవుడే గిక్కు. కాలూ సెయ్యి ఆడినంతసేపు కూలీనాలీ చేసేదాన్ని. కోతలు, ఊడు ,,... లేకపోతే, బిలిడింగుల కాడ ఉప్పరి పని. ఒంగిపోయాను. మా గు ,లోల్లే... మా గంగమ్మ తల్లే... కలో గంజో ఎత్తాది. ఆల్ల పిల్లల్ని కనిపెట్టుకుని ఉంటాను. ఊరు పొమ్మంటాది. కాదు రమ్మంటాది"

గాడి తప్పుతుంది సంభాషణ అనుకొన్నాడు పెద్దమనిషి.

"అలా అనకు అవ్వా. మీ పేదోళ్ల కోసమే మన లీడర్లు రాత్రనక పగలనక పనిచేస్తున్నారు"

"అవున్నాయనా! యిని యిని ముగ్గువగ్గయ్యా" ముసలమ్మకు కోపం ముంచుకొచ్చి గట్టిగానే అంది.

"భూముల్లేనోళ్లకు భూములిస్తున్నాం"

"ఎంతమందికిచ్చారు?"

"నీకు ఇస్తామవ్వా"

కిసుక్కున నవ్వింది బోసి నోరు.

"నేనేటి సేసుకోను"

"ఇల్లులేని వాళ్ళకు ఇళ్లు కట్టిస్తున్నాం"

యనుములమ్మ తన గుడిసె వంక చూసింది. కంప పాతి మట్టిపూసిన గోడలు. పైన సీనారేకులు. వానొచ్చి, గాలొచ్చి ఎన్నిసార్లు కుప్పకూలిపోయిందో లెక్కలేదు. గంగమ్మ మొగుడు ఆదాము మిల్లులో పనిచేస్తాడు. ఇప్పుడు పడిపోతే ఆడే నిలబెడతాడు. బతుకున్నప్పుడు ముసలోడిది ఆ పని. చుట్టూ అన్నీ అలాంటి గుడిసెలే. దూరంగా కనిపించే మేడల్ని ఎక్కిరిస్తుంటాయి.

కొన్నింటికి పైన గడ్డి. ఒక పక్కన పెంకులు. మరోపక్క తాటాకులు. ఇంకోపక్క అట్టలు, చెక్కలు. ఆ పక్కనే మురికి కాలువ.

"ఏమిటవ్వా ఆలోచిస్తున్నావ్?" వారిలో ఒకరు అడిగారు.

"ఏదో గుర్తుకొచ్చిందిలే నాయనా" నిట్టూర్చింది.

ఇంకొకడు ఏదో చెప్పుకుపోతున్నాడు. అది వాడి డ్యూటీ. "తిండి లేనోళ్లకు తిండి. పని లేనోడికి పని. ఇంటికో గేదె. గేదెకొక పాక. పాకకొక బల్బు..."

తెల్లబట్టల పెద్దమనిషి మరో సిగరెట్టు ముట్టించి, పొగ వదులుతూ అన్నాడు "ఒక్క ముక్కలో చెప్పాలంటే... సోషలిజం తెస్తున్నాం"

ముసలమ్మకి అర్థంకాలేదు. "సోషనిజమా, అదేంటి నాయనా"

"అంటే సామ్యవాదం" అన్నాడు ఇంకొకడు.

"అనగా అందరూ సమానమన్నమాట. బీదాబిక్కీ, పెద్దాగొప్పా అందరూ ఒక్కటే అన్నమాట" మరొకడు వివరించాడు.

సోసనిజమో, గీసనిజమో నాకేటి తెలుత్తాది. దొరలు బిడ్డలు మీరు" యనుములమ్మ ఈసడింపు.

"సోసనిజం కాదు మామ్మా సోషలిజమ్... సోషలిజమ్" మొదటి శాల్తీ కరెక్ట్ చేసింది.

"మీ మాటలు ఇంకా కూకుంటే సోసాచ్చేమాట మాత్రం నిజం నాయనా" ఉన్నమాట చెప్పింది.

పెద్ద మనుషులకు నోరు పెగల్లేదు. "దడొత్తంది. గంగమ్మ గుడిసెకెళితే, ఇన్ని గంజి నీళ్లన్నా పోత్తాది. అది మళ్లీ పనిలోకిగాని పోతాదో ఏమో" అవ్వ కంగారుగా లేవబోయింది.

"కూచో లేద్దువుగాని" అన్నాడు ఇంకో చోటా నాయకుడు.

"ఇంతకీ గుర్తుందా? ఎప్పుడు వోటెయ్యాలో, ఎవరికెయ్యాలో, మేం మళ్లీ వస్తాంలే. తీసుకుపోతాం" అన్నాడు ఒకడు.

"కబుర్లమీద కబుర్లు సెబుతారు కాని. ఇన్ని గంజినీళ్లు పోసేవారు లేరుగందా. ఎర్ర ఏగాణీ చేతిలో పెట్టరు గందా. ఏమ్మనుషులో ఏటో"

**"ఒక్క మాటలో చెప్పాలంటే సోషలిజం తెస్తున్నాం"**

**"సోసనిజమా! అదేంటి నాయనా!"**

"అలా అనకూడదు అవ్వా. వోటు పవిత్రం. దాన్ని అమ్ముకోరాదు" అన్నాడు మరో మనిషి.

"ఓర్నాయనో... నాకు తెలీదనుకొంటార్రా నంజికొడుకుల్లారా. మీ లీడర్లు డబ్బులిత్తారు. మీరు పోగేసుకుంటారు. గుడిసెలు కూలగొడతారు. మేడలు మిద్దెలు కడతారు. రాత్రనక పగలనక పూటుగా తాగుతారు, తింటారు. గువ్వపిట్టల్లా కులుకుతారు" అవ్వ రుసరుసలాడింది.

"నాయకులెవరూ మాకివ్వరు మామ్మా. మేం నిస్వార్థంగా, స్వచ్ఛందంగా దేశ సేవ చేస్తున్నాం"

"నా జోలి మీకెందుగ్గాని. మీ దారిన మీరు పొండి"

అప్పారావు పక్కవాడికి సైగ చేశాడు. చూపుడు వేలుతో బొటనవేలు తాడించాడు. ఐదువేళ్లు చూపించాడు. అతగాడు వెంటనే ఐదు రూపాయల నోటుతీసి ముసలమ్మ చేతిలో పెట్టాడు.

అవ్వ నోటును పరకాయించి చూస్తూ 'ఏటిది' అంది.

"ఉంచవ్వా ఐదునోటు"

ముసలమ్మ విసిరికొట్టింది.

"అడుక్కుతినే దానిననుకొన్నావురా. ఏటనుకుంతాన్నావేటి... తన్ని, ఈడ్చిగల్ను."

ముసలమ్మ రోషం చూసి వాళ్లందరికీ నవ్వొచ్చింది. నవ్వితే మరీ రెచ్చిపోద్ది. ఇంకో ఐదునోటు తీసి ఆ రెండూ కలిపి చేతిలోపెట్టి గుప్పిడి మూశాడు లీడరు బామ్మర్ది అప్పారావు.

"మర్చిపోకవ్వా" అంటూ కోరస్‌గా, విడివిడిగా పార్టీ గుర్తు చెప్పారు. "మేమొచ్చి తీసుకుపోతాం" అని బయలుదేరారు.

"మంచిది మంచిది" సాగనంపుతూ అంది యనుములమ్మ.

పది రూపాయలు కొంగున ముడివేసింది. ఆ నెల్రోజులూ చాలామంది వచ్చారు. దండాలెట్టారు. యోగక్షేమాలు విచారించారు. అరచేతిలో వైకుంఠం చూపించారు. ఒకడు ఐదు సూత్రాలన్నాడు. ఇంకొకడు పది సూత్రాలన్నాడు. మరొకడు ఇరవై సూత్రాలన్నాడు. ఇంతప్పట్నుంచి వింటూనే ఉంది. వినివిని చెవులు చిల్లులుపడ్డాయి. వచ్చినోడి దగ్గరల్లా ఐదూ పదీ గుంజిగాని వదల్లేదు. వందయిందో, రెండొందలయిందో మరి. గంగమ్మ చేతిలో పెట్టింది. పిల్లలకి గుడ్డలు కొనిపెట్టు అంది.

ఎలెక్షన్ రోజున యనుములమ్మ పాత ట్రంకుపెట్టె తీసింది. ముసలాయన కళ్లజోడు పెట్టుకొంది. ఫరవాలేదు కాస్త బాగానే కనిపిస్తుంది. మూలనున్న కర్ర తీసింది. ఇంచక్కా వెళ్ళి ఓపిగ్గా వోటేసి వచ్చింది.

"సోషనిజమ్ అంటే అంతా సమానమే. అందరూ అంతో ఇంతో ఇచ్చేరు కదా. అందరికీ సమంగా ముద్దర గుద్దేయడమే న్యాయం, ధర్మం"

యనుములమ్మ తీర్పు విని గంగమ్మ ఫక్కుమంది. ●

కథలకు ఆహ్వానం

లబ్ధ ప్రతిష్ఠులనుంచీ, కొత్త కథకుల నుంచీ వాస్తవ సమాజాన్ని ప్రతిబింబించే ఉత్తమ కథలను ఆహ్వానిస్తున్నాం. వ్రాత ప్రతి ఆరు అరఠావులు మించకూడదు.

—ఎడిటర్